క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో 'సోమవతి అమావాస్య'



శివుడికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

ఆసిఫాబాద్‌అర్బన్: సోమవతి అమావాస్య పురస్కరించుకొని సోమవారం జిల్లా కేంద్రంలోని గణపతి దేవాలయంలో శివుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు శిరీష్‌శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక అలంకరణ, అభిషేకం, బిల్వాష్టకం, అష్టోత్తరనామార్చన, మంగళహారతి, మహామంత్రపుష్పం నిర్వహించి భక్తులకు తీర్థప్రసాద వితరణ చేపట్టారు. సోమవారం అమావాస్య రావడంతో పట్టణంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం ప్రారంభిస్తున్న భుజంగరావు

ఆసిఫాబాద్‌అర్బన్: వేసవి తాపాన్ని తట్టుకునేందుకు జిల్లా కేంద్రంలోని వివేకానంద చౌక్ వద్ద మున్సిపాలిటీ ఆధ్వర్యంలో కమిషనర్ భుజంగ్‌రావ్ సోమవారం చలివేంద్రం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రానికి నిత్యం వివిధ పనుల నిమిత్తం వస్తున్న గ్రామీణ ప్రజలు వేడి నుంచి ఉపశమనాన్ని పొందేందుకు చలివేంద్రం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. వేసవికాలం ముగిసేంత వరకు చలివేంద్రం ద్వారా చల్లటి తాగునీటిని అందించనున్నట్లు తెలిపారు. కార్యాలయ సిబ్బంది సంతోష్, శంకర్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బెజ్జూర్: బెజ్జూర్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లోని సలుగుపల్లి ఫీడర్ మరమ్మతుల కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ అంజల్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫీడర్ పరిధిలోని మర్తిడి, సలుగుపల్లి, కుకుడ, అంబాగట్ తదితర గ్రామాల్లో మంగళవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

మట్టి తరలిస్తున్న ఐదు ట్రాక్టర్ల పట్టివేత

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని గన్నారం, మండువ గ్రామాల వైపు నుంచి కాగజ్‌నగర్ పట్టణానికి మట్టిని తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను సోమవారం ఈజ్‌గాం వద్ద మండల ఆర్ఐ ఖాలిక్ ఆధ్వర్యంలో పట్టుకున్నారు. పట్టుకున్న ట్రాక్టర్లను ఈజ్‌గాం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

'మహా'ఎన్నికల్లో జిల్లా నాయకుల ప్రచారం

ఆసిఫాబాద్: మహారాష్ట్రలోని చంద్రపూర్ బీజేపీ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సుధీర్ మునిగంటివార్ ఎన్నికల ప్రచారంలో ఉమ్మడి జిల్లా నాయకులు సోమవారం ప్రచారం నిర్వహించారు. చంద్రపూర్ పార్లమెంట్ పరిధి ఆర్నీ, వణి పట్టణాల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, తెలుగు కార్యక్రమాల ఇన్‌చార్జి బోనగిరి సతీశ్‌బాబు పాల్గొన్నారు.

కురిసిన చిరుజల్లులు

కౌటాల: మండలంలో సోమవారం వేకువజామున చిరుజల్లులు కురిశాయి. దీంతో వాతావరణం చల్లబడింది. గత వారం రోజులుగా ఎండ వేడికి, వడ గాలులతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు చిరుజల్లులు కురవడంతో వేడి నుంచి ఉపశమనం పొందారు. వారం రోజుల తర్వాత ఒక్కసారిగా వాతావరణం చల్లబడడంతో ప్రజలు మండల కేంద్రంలోని రహదారులపై రద్దీగా కనిపించారు. ప్రస్తుతం మండలంలో మొక్కజొన్న, జొన్న పంటలు కోత దశలో ఉన్నాయని, భారీ వర్షాలు కురిస్తే పంటలకు తీరని నష్టం జరుగుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

నీటి సమస్య లేకుండా చర్యలు చేపట్టాలి

భీమిని: భీమిని, కన్నెపల్లి మండలాల్లోని గ్రామాల్లో నీటి సమస్య లేకుండా చర్యలు చేపట్టాలని మండల ప్రత్యేక అధికారి జగన్మోహన్‌రెడ్డి, ఎంపీడీవో గంగామోహన్ అన్నారు. భీమిని మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ భగీరథ అందని ఇళ్లకు ప్రత్యామ్నాయంగా పంచాయతీ వాటర్ ట్యాంకర్ల ద్వారా అందజేయాలన్నారు. బోర్‌వెల్‌తోపాటు పైపులైన్ లీకేజీల సమస్య ఉంటే వెంటనే మరమ్మతు చేయించాలన్నారు. ఉపాధి కూలీలకు అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు.

రోడ్డుపైనే విద్యుత్ స్తంభాలు

- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని విద్యుత్ అధికారులు



సిర్పూర్(టి) -మాకిడి అంతర్రాష్ట్ర రహదారిలో రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభం



స్థానిక డౌనల్ ప్రాంతంలో రోడ్డుకు ఆనుకొని ఉన్న విద్యుత్ స్తంభం

సిర్పూర్(టి): మండలంలోని ప్రధాన రహదారుల్లో రోడ్డుకు ఆనుకొని, రోడ్డు పక్కనే విద్యుత్ స్తంభాలు ఉండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ శాఖ అధికారులు నిత్యం విద్యుత్‌లైన్లకు మరమ్మతులు చేపడుతున్నా రోడ్డుకు ఆనుకొని ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించడంలో మాత్రం నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో రాత్రి సమయాల్లో ప్రధాన రహదారుల్లో వాహనదారులు ఆదమరిస్తే రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు. సిర్పూర్(టి) మేజరు గ్రామపంచాయతీ పరిధిలోని బస్టాండ్ నుంచి డౌనల్ వెళ్లే ప్రధాన రహదారిలో డౌనల్ సమీపంలోని వెంకటేశ్వరాలయం ముందు ఉన్న విద్యుత్తు స్తంభం రోడ్డుకు ఆనుకొని ఉండగానే నూతన సీసీరోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. ఈ రహదారిలో సిర్పూర్(టి) గ్రామపంచాయతీ ప్రజలతో పాటు సిర్పూర్(టి), కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూర్ మండలాల్లోని గ్రామాల ప్రజలు ప్రయాణాలు సాగిస్తుంటారు. సిర్పూర్(టి) -మాకిడి అంతర్రాష్ట్ర రహదారిలో దుబ్బగూడ కాలనీ సమీపంలో రోడ్డుకు ఆనుకొని విద్యుత్ స్తంభం ఉండటంతో ఈ రహదారి గుండా ప్రయాణించే వాహనదారులకు ఇబ్బందులు తప్పడంలేదు. మండలంలోని నవేగాం, హుడ్కిలి, జక్కాపూర్, మాకిడి గ్రామాలతో పాటు మహారాష్ట్ర పట్టణాలకు వెళ్లే ప్రధాన రహదారి కావడంతో నిత్యం వాహనాల రాకపోకలు కొనసాగుతుంటాయి. ప్రధాన రహదారుల్లో వాహనదారులకు ఆటంకంగా ఉన్న విద్యుత్ స్తంభాలను సంబంధిత శాఖ అధికారులు తొలగించకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రధాన రహదారుల్లో రోడ్డుకు ఆనుకొని ఉన్న విద్యుత్ స్తంభాలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యుత్ స్తంభాలతో ఇబ్బందులు



మండల కేంద్రంలోని డౌనల్ ప్రాంతం ప్రధాన రహదారిలో గల విద్యుత్ స్తంభంతో పాటు ఇతర ప్రధాన రహదారుల్లో రోడ్లకు ఆనుకొని ఉన్న విద్యుత్ స్తంభాలతో ఇబ్బందులు పడుతున్నాం. ఏళ్లుగా స్తంభాలు ప్రమాదకరంగా ఉన్న వాటిని తొలగించడంలో విద్యుత్ శాఖ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు.

– రాపర్తి శ్రీకాంత్, సిర్పూర్ (టి)

అధికారులు స్పందించాలి



ప్రధాన రహదారుల్లో వాహనదారులకు ఆటంకంగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించకుండా సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఏళ్లు గడుస్తున్నా వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడంలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రధాన రహదారుల్లో రోడ్డుకు ఆనుకొని ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించాలి.

– భూపల్లి ప్రసాద్, సిర్పూర్ (టి)

చేరిన 'ఉపాధి' లక్ష్యం

- ఉపాధిహామీ కూలీలకు పని దినాల కల్పన
- అధిక పని దినాలు కల్పించిన మూడు మండలాలు
- దహెగాం, తిర్యాణి, వాంకిడి కూలీల హర్షం



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

తిర్యాణి: ఉపాధిహామీ పని దినాల కల్పనలో జిల్లాలోని మూడు మండలాలు లక్ష్యాన్ని చేరుకున్నాయి. దహెగాం, తిర్యాణి, వాంకిడి మండలాల్లో అధికారులు ఉపాధి హామీ కూలీలకు ఎక్కువ పని దినాలు కల్పించారు. ఉపాధిహామీ పథకంలో భాగంగా ఎక్కువ మందికి ఉపాధి కల్పించడానికి ఏటా పని దినాల లక్ష్యాన్ని కేటాయిస్తున్నారు. ఇందులో భాగంగా 2023 –24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జిల్లాలోని మూడు మండలాలు పని దినాల లక్ష్యాన్ని చేరుకున్నాయి.

టాప్‌లో దహెగాం మండలం..

జిల్లాలో పని దినాల కల్పనలో దహెగాం మండలం ప్రథమ స్థానంలో నిలిచింది. దహెగాం మండలంలో మొత్తం జాబ్‌కార్డులు 7761 ఉండగా, పనికి వెళ్లే కూలీలు 6552 మంది ఉన్నారు. 2023- 24 ఆర్థిక సంవత్సరానికి కల్పించే పని దినాల లక్ష్యంగా 3,48,259 ఉండగా లక్ష్యం మించి 3,75,000 పని దినాలను కల్పించారు. మండలంలో వంద రోజులు పని పూర్తి చేసుకున్న కూలీలు 800 మంది ఉన్నారు. కాగా ఇప్పటి వరకు మండలంలో ఉపాధి హామీకి రూ.9.86 కోట్లు ఖర్చు చేశారు.

3 లక్షల 24వేల పనిదినాలు

తిర్యాణి మండలంలో 29 గ్రామపంచాయతీలు ఉండగా ఉపాధిహామీ పథకానికి సంబంధించిన జాబ్ కార్డులు కలిగిన కుటుంబాల సంఖ్య 7596గా ఉంది. ఇందులో యాక్టివ్ జాబ్‌కార్డులు 4,768 ఉండగా ఈ జాబ్‌జార్డు పరిధిలో 8,156 మంది కూలీలు ఉపాధి పనులు చేపడుతున్నారు. కాగా 2023 –24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మండలంలో 113 కుటుంబాలకు వందరోజులు పనులు కల్పించారు. మొత్తంగా మండలంలో 2.58 లక్షల పని దినాలను కల్పించాలనే లక్ష్యం ఏర్పాటు చేసుకోగా 3.24 లక్షల పని దినాలు కల్పించారు. ఇందుకుగాను దాదాపు రూ.10 కోట్ల వరకు వేతనాలు చెల్లించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2024 –25కుగాను చేపట్టనున్న ఉపాధి పనులకు సంబంధించి ఇప్పటికే ఈజీఎస్ శాఖ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. అన్ని గ్రామాల్లో గ్రామ సభలు ఏర్పాటు చేసి పనుల గుర్తింపు కార్యక్రమం చేపట్టారు.

వాంకిడి మండలంలో..

వాంకిడి మండలంలో 2,44,668 పని దినాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకోగా మొత్తం 2,72,986 పనిదినాలను కల్పించారు. మండలంలో జాబ్‌కార్డులు కలిగిన కుటుంబాలు 9, 872 ఉండగా ఇందులో యాక్టివ్ జాబ్‌కార్డులు 6091 ఉన్నారు. నిత్యం పనికి వెళ్లే కూలీల సంఖ్య 11055గా ఉంది.

లంబాడిహేటిలో కార్డన్‌సెర్చ్



స్వాధీనం చేసుకున్న బెల్లం పానకం, నాటుసారా తయారీ సామగ్రి

చింతలమానెపల్లి: మండలంలోని లంబాడిహేటి, గుప్పగూడెం గ్రామాలలో సోమవారం పోలీసు, అబ్కారీ శాఖ ఆధ్వర్యంలో కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. కౌటాల సీఐ సాదిక్‌పాషా ఆధ్వర్యంలో ఇంటింటికీ తనిఖీలు నిర్వహించారు. తనిఖీలలో భారీగా బెల్లం పానకం, నాటుసారా తయారీ సామగ్రిని పోలీసులు ధ్వంసం చేశారు. గ్రామానికి చెందిన లావుడ్య తిరుపతి, ధరావత్ జగ్యానాయక్, అజ్మీర శివరాం, లావుడ్య బాలు, భూక్యా తిరుపతి ల వద్ద నుంచి నాటుసారా స్వాధీనం చేసుకొని ఐదుగురిపై కేసులు నమోదు చేశారు. సీఐ గ్రామస్తులతో మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయనతో పాటు ఎస్సై నరేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికులు బస్సు సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి

రెబ్బెన: ఏఐటీయూసీ పోరాట ఫలితంగా గోలేటి ఎక్స్‌రోడ్ నుంచి కైరిగూడ ఓసీపీ వరకు యాజమాన్యం ఏర్పాటు చేసిన బస్సు సౌకర్యాన్ని కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం నుంచి మూడు షిఫ్టులు బస్సును నడిపేందుకు యాజమాన్యం అంగీకరించినట్లు తెలిపారు. బుధవారం సెకండ్ షిఫ్టు నుంచి బస్సు గోలేటి ఎక్స్‌రోడ్ నుంచి కైరిగూడ ఓసీపీ వరకు బస్సు నడుస్తుందని తెలిపారు. కార్మికుల ఇబ్బందులను గుర్తించి సహకరించిన ఏరియా జీఎం రవిప్రసాద్‌కు, కైరిగూడ ప్రాజెక్టు అధికారి సత్యనారాయణలకు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు ఉగాది పచ్చడి పంపిణీ

ఆసిఫాబాద్‌అర్బన్: శ్రీక్రోధి నామ సంవత్సరం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌక్ వద్ద నేడు ఉదయం 9 గంటల నుంచి ఉగాది పచ్చడి పంపిణీ చేయనున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రూప్‌నార్ రమేశ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నిజాయతీ చాటుకున్న డ్రైవర్



సెల్‌ఫోన్ అప్పగిస్తున్న ఉమేశ్‌గౌడ్

రెబ్బెన: మండల కేంద్రానికి చెందిన గొడిసెల ఉమేశ్‌గౌడ్ అనే ఆటో డ్రైవర్ నిజాయితీ చాటుకున్నాడు. సోమవారం ఇంటికి వెళ్తున్న క్రమంలో ఆటోలో ఎవరో ప్రయాణికుడు మరిచిపోయిన సెల్‌ఫోన్‌ను గుర్తించాడు. వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి సెల్‌ఫోన్‌ను హెడ్‌కానిస్టేబల్ శ్రీనివాస్ రెడ్డికి అప్పగించాడు.

యువతి అదృశ్యం

ఆదిలాబాద్‌టౌన్: నార్నూర్ మండలానికి చెందిన ఓ యువతి జిల్లా కేంద్రంలోని అష్టలక్ష్మి జిన్నింగ్ మిల్లులో పని చేస్తుంది. పెళ్లి చేస్తామని కుటుంబీకులు గత నెల 13న ఆమెను ఫ్యాక్టరీ నుంచి తీసుకెళ్లేందుకు వచ్చారు. ఫ్యాక్టరీ నుంచి ఆదిలాబాద్ బస్టాండ్‌కు వచ్చిన తర్వాత వాటర్ బాటిల్ కోసమని వెళ్లి తిరిగి రాలేదు. చుట్టుపక్కల వెతికిన కనిపించ లేదు. సోమవారం టూటౌన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ అశోక్ తెలిపారు.

పాఠశాల కమిటీలను బలోపేతం చేయాలి



దహెగాం: అవగాహన కల్పిస్తున్న నోడల్ అధికారి

దహెగాం: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను బలోపేతం చేయాలని మండల నోడల్ అధికారి శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, తాగునీరు, మరుగుదొడ్ల నిర్మాణం, తరగతి గదుల విద్యుద్దీకరణ, పాఠశాల ప్రాంగణంలో పారిశుద్ధ్య నిర్వహణ, సోలార్ ప్యానెల్ ఏర్పాటు, విద్యార్థులకు యూనిఫాం తదితర పనులను అమ్మ ఆదర్శ కమిటీ వారు నిర్వహిస్తారన్నారు. రిసోర్స్ పర్సన్ శ్రీనివాస్, ఎంపీడీవో రాజేందర్, ఐకేపీ ఏపీఎం చంద్రశేఖర్, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

కౌటాల: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు కృషి చేయాలని జిల్లా కోఆర్డినేటర్ భరత్‌కుమార్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు ఐకేపీ వీవో అధ్యక్షుడు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అదనపు డీఆర్‌డీవో రామకృష్ణ, డీపీఎండీ అన్నాజీ, ఎంపీడీవో నస్రుల్లాఖాన్, ఎంఈవో సోమయ్య, ఏపీఎం ముక్తేశ్వర్, ఏఈ ప్రవీణ్, సమాఖ్య మండలాధ్యక్షుడు కమల, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ముందస్తు వేడుకలు



లేతన్‌గూడలో పచ్చడి తయారు చేస్తున్న విద్యార్థులు

రెబ్బెన: మండలంలోని పలు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో సోమవారం విద్యార్థులు, ఉపాధ్యాయులు ముందస్తు ఉగాది సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. లేతన్‌గూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలతో పాటు రేకులగూడ పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు క్రోధినామ సంవత్సరం పురస్కరించుకొని ఉగాది పచ్చడి తయారు చేశారు. ప్రధానోపాధ్యాయులు రవికుమార్, మహేశ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రారంభమైన ఉగాది పూజలు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలో విశ్వబ్రాహ్మణులు శ్రీక్రోధి నామ నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని ఉగాది సందర్భంగా సోమవారం నూతన సంవత్సరానికి ఘన స్వాగతం పలుకుతూ ఒక రోజు ముందు నుంచే ప్రత్యేక పూజలు చేశారు. పూజా గదిలో పుస్తకాలను, కులవృత్తుల పనిముట్లకు పూజలు నిర్వహించారు.

తాగునీటికి ఇబ్బంది లేకుండా చూస్తాం



చేతిపంపును పరిశీలిస్తున్న ఎంపీడీవో కృష్ణారావు

కెరమెరి: తాగునీటికి ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తామని ఎంపీడీవో కృష్ణారావు, ప్రత్యేకాధికారి ఆడే ప్రకాశ్ అన్నారు. సోమవారం మండలంలోని కెస్లాగూడ గ్రామంలో తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు తెలపడంతో చేతిపంపులను పరిశీలించారు. రెండు రోజులుగా మోటారు చెడిపోవడంతో ఇళ్లకు నీరు అందడం లేదని, ఉన్న చేతిపంపులు కూడా దూరంగా ఉన్నాయని ప్రజలు తమ కష్టాలు తెలియజేశారు. దీంతో వెంటనే మోటరు బాగుచేయించి నీటిని అందించారు. పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్ ఉన్నారు.

ఎలాంటి సమస్యనైనా ఎదుర్కోవాలి



బాలికలకు అవగాహన కల్పిస్తున్న సునీత

కెరమెరి: బాలికలు ఎలాంటి పరిస్థితులైనా ఎదుర్కొనే ధైర్యం కలిగి ఉండాలని ఆసిఫాబాద్ షీటీం ఇన్‌చార్జి సునీత అన్నారు. సోమవారం మండలంలోని మోడి బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఎస్పీ సురేశ్ కుమార్ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. బాలికల రక్షణ కోసమే షీటీంలు పని చేస్తున్నాయన్నారు. మహిళలపై హింస, ఈవ్‌టీజింగ్, సైబర్ క్రైంలకు ఎవరైనా గురైతే వెంటనే షీం టీంను సంప్రదించాలన్నారు. అత్యవసర సమయాల్లో 100కు కాల్ చేయాలన్నారు. ఆసిఫాబాద్ షీటీం నంబర్ 8712670564 డయల్ చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో షీటీం సభ్యురాలు శ్రీలత, స్వప్న, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

'కార్మికుల హక్కులు సాధించిన ఘనత టీబీజీకేఎస్‌దే'



రశీదు అందజేస్తున్న శ్రీనివాస్‌రావు

రెబ్బెన: సింగరేణి కార్మికులకు అనేక హక్కులను సాధించి పెట్టిన ఘనత టీబీజీకేఎస్‌దేనని ఆ సంఘం బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్‌రావు అన్నారు. సోమవారం ఏరియాలోని గోలేటి సీహెచ్‌సీలో టీబీజీకేఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ సింగరేణి కార్మికులకు కోల్ ఇండియాలో సైతం లేని అనేక హక్కులను టీబీజీకేఎస్ సాధించి పెట్టిందన్నారు. ఈనెల 24న గోదావరిఖనిలో టీబీజీకేఎస్ జనరల్ బాడీ సమావేశం ఉంటుందని తెలిపారు. నాయకులు సమ్మయ్య, సంపత్, మహేందర్‌రెడ్డి, వరలక్ష్మి, శ్రీనివాస్, రమేశ్, సమ్మయ్య, మురళీకృష్ణ, కవిత, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న అడిషనల్ డీఎంహెచ్‌వో కుడ్మేత మనోహర్

ఇంద్రవెల్లి: గ్రామీణ ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది ప్రజల ఆరోగ్య విషయంపై అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా హైరిస్క్ గర్భిణులు, బాలింతలను గుర్తించి ఎప్పటికప్పుడు వైద్య సేవలు అందించాలని అదనపు డీఎంహెచ్‌వో కుడ్మేత మనోహర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఆరోగ్య కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు, ఆస్పత్రి సిబ్బంది సమావేశం నిర్వహించారు. ప్రజల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. వేసవిలో వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో వైద్యుడు శ్రీకాంత్, సీహెచ్‌వో సందీప్, హెచ్‌ఈవో తులసిదాస్, పీహెచ్‌ఎన్ జ్యోతి, హెల్త్ సూపర్‌వైజర్ జాదవ్ శ్రీనివాస్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

ఇచ్చోడ: సర్కారు ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలని అడిషనల్ డీఎంహెచ్‌వో సాధన అన్నారు. సోమవారం నర్సాపూర్ ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈసందర్భంగా పలు రికార్డులను పరిశీలించి సిబ్బందితో మాట్లాడారు. ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే గర్భిణులకు, బాలింతలకు ప్రతీ నెల వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేయాలన్నారు. ఆస్పత్రికి సంబంధించిన రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలన్నారు. చిన్న పిల్లలకు వారం వారం టీకాలు ఇవ్వాలన్నారు. ఆమె వెంట డాక్టర్ కిరణ్, వైద్య ఉన్నారు.

'బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం'

- ఎమ్మెల్సీ దండే విఠల్



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ దండే విఠల్

బెజ్జూర్: ఇటీవల ఆత్మహత్యకు పాల్పడిన బీఆర్‌ఎస్ కార్యకర్త సేందే నీలయ్య కుటుంబాన్ని ఆదుకుంటామని ఉమ్మడి ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండే విఠల్ అన్నారు. మండలంలోని నాగుల్వాయి గ్రామంలోని మృతుడి నివాసానికి చేరుకొని సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ నీలయ్య మృతి పార్టీకి తీరని లోటన్నారు. అనంతరం సోమిని గ్రామంలో పర్యటించారు. ఆయన వెంట బెజ్జూర్ జెడ్పీటీసీ పుష్పలత, నాయకులు సోయం చిన్నయ్య, సామల రాజన్న, బాబురావు తదితరులు ఉన్నారు.

స్థలాన్ని పరిశీలించిన అధికారులు



స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట అక్రమంగా కంచె వేసిన స్థలాన్ని సోమవారం తహసీల్దార్ వెంకటేశ్వరరావు, ఎంపీడీవో ఆల్బర్ట్ పరిశీలించారు. వారు మాట్లాడుతూ పంచాయతీ స్థలంలో వేసిన అక్రమ కంచెను వెంటనే తొలగించాలన్నారు. లేనిపక్షంలో కంచె తొలగించి పంచాయతీరాజ్ చట్టం ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. స్థలానికి సంబంధించిన పత్రాలు ఉంటే తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదించాలని కంచె వేసిన వారికి సూచించారు. వారి వెంట పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, పోలీసులు ఉన్నారు.